సాక్షి ప్రకాశం

ఆదివారం । 14 । జులై । 2024



కంటివైద్య శిబిరానికి విశేష స్పందన

సినీ హీరో, నిర్మాత బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కంటివైద్య శిబిరాన్ని నిర్వహించారు. - 8లో..



దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కంభం సీఐ తెలిపారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 28.5/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

రేపు మాజీమంత్రి బాలినేని రాక

ఒంగోలు: మాజీమంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ఈనెల 15న ఒంగోలుకు రానున్నట్లు వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ నుంచి ఒంగోలుకు చేరుకుంటారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీ, జెడ్పీటీసీ,కార్పొరేటర్లు, మహిళా నాయకురాళ్లు, డివిజన్ అధ్యక్షులు వాసన్నకు స్వాగతం పలకాలని కోరారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయులకు శాశ్విత కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రస్తుతం 603 మంది ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. కానీ 102 మంది ఉపాధ్యాయులు 28 ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు లేక ఇతర పాఠశాలల్లో పనిచేస్తున్నారని చెప్పారు. కొంతమంది మండల విద్యాశాఖ అధికారులు విద్యార్థులు లేక ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంలో జాప్యం చేస్తున్నారని తద్వారా వీరు రోజుకు ఒక పాఠశాల చొప్పున ఇతర పాఠశాలల్లో పనిచేస్తున్నారన్నారు. డీఈవో ప్రభుత్వ సూచనల ప్రకారం ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను తయారుచేసి శాశ్వితంగా ప్రభుత్వ పాఠశాలలకు కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులు అర్హులైన వారందరికీ పదోన్నతి సౌకర్యం కల్పించాలన్నారు. ఆస్తులతో సహా ప్రభుత్వానికి సరెండర్ చేసిన పాఠశాలలకు విధి విధానాలు రూపొందించాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ తరుపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఇంటర్మీడియెట్ నాన్‌టీచింగ్ స్టాఫ్ జిల్లా అధ్యక్షునిగా శ్రీనివాసరావు



నూతన సంఘ సభ్యులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కేపీ రంగనాయకులు

ఒంగోలు: ఇంటర్మీడియెట్ నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా సీహెచ్ శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ ఎంపిక జరిగింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లు అందరు సంయుక్తంగా ఈ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, కార్యదర్శిగా కంభం జూనియర్ కాలేజీ సీనియర్ అసిస్టెంట్ ఎస్కే అబ్దుల్ హయత్, కోశాధికారిగా టంగుటూరు జూనియర్ కాలేజీ టైపిస్టు ఎన్‌సీ సాయికిషోర్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ ఎంపిక ప్రక్రియకు ఎన్నికల అధికారులుగా ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కేపీ రంగనాయకులు, ప్రకాశం జూనియర్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సి.తారక్‌నాథ్‌లు వ్యవహరించారు.

నైరుతుపవనాలు



చుక్కనీరు లేని మార్కాపురం చెరువు

ఋతుపవనాలు వచ్చినా.. సకాలంలో వర్షాలు పడటం లేదు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో మబ్బులు కమ్ముకోవడమే తప్ప చినుకు జాడలేదు. మిగిలిన ప్రాంతాల్లో అరకొరగా పడే చినుకులతో నేల తడుస్తోంది తప్ప పంటలు సాగుచేసుకునేందుకు అనువైన వర్షాలు కురవడం లేదు. ఫలితంగా ఖరీఫ్ పంటల సాగు మందగించింది. వర్షాలు లేకపోవటంతో పొలాలన్నీ బీడు భూములుగా ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవటంతో బోర్లన్నీ ఒట్టిపోయాయి. పరిస్థితి ఇలాగే ఉండి ఆలస్యంగా నాట్లు వేస్తే తెగుళ్లు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- జిల్లాలో అరకొరగా వర్షపాతం
- ఖరీఫ్‌లో సాగు కావాల్సిన విస్తీర్ణం 2,02,249 హెక్టార్లు
- సాగైంది 14,284 హెక్టార్లలోనే..
- పశ్చిమాన కరువు పరిస్థితులు

మార్కాపురం: జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఖరీఫ్ ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, పొలాలు పదునెక్కకపోవడంతో వ్యవసాయం ముందుకు సాగడం లేదు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పడుతున్న వర్షపు జల్లులు తేమ శాతాన్ని పెంచుతున్నాయే తప్ప పంటలు సాగు చేసుకునేందుకు ఉపయోగపడటం లేదు. రుతుపవనాలు సకాలంలో వచ్చి వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటిస్తున్నా ఆకాశంలో మబ్బులజాడ తప్ప వర్షపు చినుకు పొలంలో పడటం లేదు. వర్షం కోసం రైతులు ప్రతిరోజూ ఎదురుచూస్తున్నారు. వర్షాలు ఆలస్యంగా కురిస్తే పంటలు కూడా ఆలస్యంగా సాగుచేయాల్సి వస్తుంది. దీని వలన ఊహించని తెగుళ్లు పంటలకు సోకుతాయి.



అరకతో దుక్కులు దున్నుతున్న రైతు

వర్షం కోసం ఎదురుచూపులు



జూన్ నెలాఖరుకైనా వర్షం పడుతుందని ఎదురుచూశాం. చిరుజల్లులు తప్ప పంటలు వేసుకునేందుకు అనుకూలమైన వర్షాలు ఇంత వరకూ లేవు. మార్కాపురం ప్రాంతమంతా వర్షాధారంపైనే రైతులందరం పంటలు సాగు చేసుకుంటున్నాం. పదును వాన కురిస్తే విత్తనాలు చల్లుకుంటాం. అడపా దడపా కురుస్తున్న వర్షాల వలన రైతులకు ఎటువంటి ఉపయోగం లేదు.

– రామిరెడ్డి, రైతు, వేములకోట

పశ్చిమ ప్రకాశంలో కరువు పరిస్థితి ఇలా...

పశ్చిమ ప్రకాశంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఖరీఫ్ ప్రారంభమై 40 రోజులు దాటినా పొలాల్లో పంటల సాగు లేదు. సాధారణ వర్షపాతం కూడా పలు మండలాల్లో నమోదు కాలేదు. ఎండిపోయిన చెరువులు, బీడు భూములు దర్శనమిస్తున్నాయి. ప్రతి రోజు మబ్బులు వస్తున్నా... పదును వర్షం మాత్రం పొలాల్లో పడటం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పశ్చిమ ప్రకాశంలో 12 మండలాలు ఉండగా, మూడు వ్యవసాయ సబ్ డివిజన్‌లు ఉన్నాయి.

జులైలో వర్షపాతం ఇలా...

జులై నెలలో పశ్చిమ ప్రకాశంలో మొత్తం 97.1 మి.మీ వర్షపాతం నమోదు కావాలి. ఇప్పటి వరకూ గిద్దలూరులో 12.4, కొమరోలులో 17.8, తర్లుపాడులో 1.2, యర్రగొండపాలెంలో 21.2, పుల్లలచెరువులో 1.4, త్రిపురాంతకంలో 23.2, దోర్నాల 12.8, పెద్దారవీడు 4, మార్కాపురం 2.4, అర్ధవీడు 2.8, బేస్తవారిపేట 8.2, కంభం 5.4, రాచర్ల 33.2 మి.మీ వర్షపాతం కురిసింది. కురిసిన వర్షం కూడా కేవలం జులై 1, 2, 6, 8, 9 తేదీల్లో మాత్రమే కురిసింది. ఈ వర్షానికి పొలాలు పదునుకాలేదు. కాడి ముందుకు సాగడం లేదు.

వర్షం పడితేనే పంటల సాగు



వర్షం పడితేనే సజ్జ, కంది, పత్తి, జొన్న తదితర పంటలు వేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. సీజన్ ప్రారంభమై నెల 15 రోజులు కావస్తున్నా పొలాలేవీ పదునెక్కలేదు. సేద్యాలన్నీ చేసి పెట్టుకున్నాం. వరుణ దేవుడు ఇంకా కరుణించలేదు. ఈ నెలాఖరు వరకూ ఇదే పరిస్థితి ఉంటే వ్యవసాయం చేయడం కష్టంగా ఉంటుంది. కాలంమార్చి పంటలు సాగుచేస్తే తెగుళ్ల వస్తాయనే భయం ఉంది.

– తుమ్మా వెంకటరెడ్డి, రైతు

జిల్లాలో సాగు ఇలా...

జిల్లా మొత్తం మీద ఖరీఫ్‌లో 2,02,249 హెక్టార్లలో వివిధ పంటలు సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకూ సాగు 14,284 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి.

పంట పేరు	సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	134
జొన్న	12
సజ్జ	1211
మొక్కజొన్న	712
కొర్రలు	1165
పెసలు	78
మినుములు	53
కందులు	1382
వేరుశనగ	240
నువ్వులు	1642
పొద్దుతిరుగుడు	16
ఆముదం	228
పత్తి	2000
మిర్చి	28
డ్రైఫ్రూట్స్ సాగు	1961
టమోటా	59
ఇతర కూరగాయలు	286
ఇతర పంటలు	415

ఫ్రెష్ అండ్ డ్రై ఫ్రూట్స్

పంట పేరు	సాగు కావాల్సినవి (హెక్టార్లలో)	సాగైనవి (హెక్టార్లలో)
ఉల్లి	217	1
టమోటా	653	59.20
ఇతర కూరగాయలు	1619	286.14
జనుము	173	443.06
పామాయిల్	6	0
ఇతర ఆయిల్ పంటలు	14	0
సుబాబుల్	21652	2084
మొత్తం నార్కోటిక్స్ ప్లాంట్స్	1664	0
పశుగ్రాసం పంటలు	2863	81.82
పచ్చిరొట్ట పైర్లు	306	36.62
సుగంధ మొక్కలు	6	0
పూలమొక్కల సాగు	56	0
మల్బరీ	112	0
నాన్‌ఫుడ్ క్రాప్స్	205	1
ఇతర మసాలా దినుసులు	65	0
ఇతర పంటలు	0	415.45

ఈ నెల 10 నాటికి ప్రధాన పంటల సాగు ఇలా..

పంట పేరు	సాగు కావాల్సినవి (హెక్టార్లలో)	సాగైనవి (హెక్టార్లలో)
వరి	14078	134
జొన్న	194	12.40
సజ్జ	7125	1211.22
మొక్కజొన్న	2464	712.80
రాగి	34	0
సామలు	1	0
కొర్రలు	1373	1165.20
వరిగెలు	4	0
ఆరికెలు	10	0
ఉలవలు	8	0
పెసలు	1061	78.63
మినుములు	2520	53
కందులు	73003	1382.22
అలసందలు	117	0
వేరుశనగ	544	240.55
నువ్వులు	2790	1642.07
పొద్దుతిరుగుడు	161	16
ఆముదం	1723	228.20
సోయాబీన్	21	0
పత్తి	31562	2000.99
చెరకు	84	0
వక్కలు	1	0
మిర్చి	23873	28.20
చింత	6	1
పసుపు	358	8

సాధారణంగా ఖరీఫ్‌లో రైతులు సజ్జ, కంది, ఆముదం, పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తారు. వర్షాలు లేకపోవటంతో పొలాలన్నీ బీడు భూములుగా ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవటంతో బోర్లన్నీ ఒట్టిపోయాయి. ఇటీవల కురిసిన వర్షానికి కొంత మంది రైతులు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆలస్యంగా నాట్లు వేస్తే తెగుళ్లు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి రోజు వర్షం కోసం రైతులు ఎదురుచూడటమే సరిపోతుంది.

తల్లులకు వందనం కాదు..పంగనామం

- ఎన్నికలకు ముందు ఒకలా.. ఎన్నికల తరువాత మరోలా
- చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ అందరూ చెప్పింది ప్రతి విద్యార్థికి రూ.15 వేలు
- నేడు జీవోలో మాత్రం ప్రతి తల్లికి రూ.15 వేలు
- ఆధార్ లింకు కోసమే జీవో అంటూ మెలిక భాష్యాలు
- మాజీ సీఎంపై అక్రమ కేసులు పెట్టడం దారుణం
- మాజీమంత్రి బాలినేని, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి



బాలినేని శ్రీనివాసరెడ్డి



జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: తల్లులకు వందనం అంటూ ఎన్నికలకు ముందు ఒకమాట, ఎన్నికల తరువాత మరోమాట అన్నట్లుగా టీడీపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, తల్లులకు వందనం కాదని పంగనామం పెట్టడమే అని మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి శనివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మానవ వనరుల శాఖామంత్రి నారా లోకేష్ అందరూ ఎన్నికల సమయంలో బడికి వెళ్తున్న ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారన్నారు. కానీ నేడు విద్యాశాఖ జారీచేసిన జీవోలో ప్రతి తల్లికి రూ.15 వేలు అని ప్రకటించడం ద్వారా ఎన్నికల తరువాత మాట మార్చినట్లు అయిందన్నారు. దీంతో ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో విద్యాశాఖ మాట మార్చి పథకంలో తల్లులకు ఆధార్ అనుసంధానించడానికే జీవో జారీచేసిందని, మార్గదర్శకాలు త్వరలో విడుదల చేస్తామని సర్దుబాటు చేసుకునే ప్రక్రియ మొదలుపెట్టారన్నారు. వాస్తవానికి అమ్మ ఒడి పథకానికి సంబంధించి గతంలోనే తల్లుల ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేశారన్నారు. దీనిద్వారా మరోమారు తల్లులకు పంగనామాలు పెడుతూ అందరినీ పచ్చిగా మోసం చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. చంద్రబాబు నయవంచనకు మారుపేరు అని మరో మారు రుజువైందని విమర్శించారు.

జగన్‌పై అక్రమ కేసు:

సాక్షాత్తు సుప్రీంకోర్టు తప్పుబట్టినా కూడా మూడేళ్ల తరువాత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ ఐపీఎస్, డాక్టర్‌పైన కేసులు నమోదు చేయడం ఎవరి సంతోషం కోసం అని ప్రశ్నించారు. దురుద్దేశం, రాజకీయ కక్షతో కేసులు నమోదు చేయడం ద్వారా రాష్ట్రంలో పోలీసులు నూతన సంప్రదాయానికి తెరదీశారన్నారు. ఇది ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఈ కేసులో జగన్ అసలు ముద్దాయి ఎలా అవుతారని, ఇంతకన్నా తప్పుడు కేసు మరొకటి లేదన్నారు. పాలించే వ్యక్తి మారితే రాజ్యాధికారం కూడా మారుతుందా అంటూ ప్రశ్నించారు. గతంలోనే సుప్రీంకోర్టు 77 రోజుల తరువాత సాక్షులను విచారించడమే సరికాదని చెప్పిందని, మరి ఇప్పుడు మూడేళ్ల తరువాత విచారిస్తే ఏం జరుగుతుందన్నారు. 11వ తేదీ రఘురామరాజు ఫిర్యాదు చేస్తే ఒకరోజు ముందే లీగల్ ఒపీనియన్‌కు లేఖ రాయడం వెనుక వాస్తవం ఏమిటో అర్థం చేసుకోవచ్చని మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు.

ఎస్పీగా ఏఆర్ దామోదర్

- ప్రస్తుతం ఒంగోలు పీటీసీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న దామోదర్
- ఎస్పీ సుమిత్ సునీల్‌కు డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయమని ఆదేశం



నూతన ఎస్పీ ఏఆర్ దామోదర్ (ఫైల్)

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా ఎస్పీగా ఏఆర్ దామోదర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా ఒంగోలు పోలీసు ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న దామోదర్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఆయన మార్కాపురం ట్రైనీ డీఎస్పీగా పనిచేశారు. ఆ సమయంలో రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన మున్నా భాయ్ కేసును ఛేదించి ప్రశంసలు పొందారు. తరువాత ఆయన విజయనగరం ఎస్పీగా చేశారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌ను డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు.

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ఒంగోలు: స్థానిక లార్డ్‌కృష్ణా షటిల్ అకాడమీలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లార్డ్‌కృష్ణా షటిల్ అకాడమీ సభ్యులు క్రీడాకారులకు అందిస్తున్న సేవలను అభినందించారు. జిల్లాలో క్రికెట్ స్టేడియం కొరతను అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న ఇండోర్ స్టేడియంతోపాటు మరో ఇండోర్ స్టేడియం నిర్మాణం, టెన్నిస్, షటిల్ వంటి అనేక క్రీడలకు ప్రోత్సాహం కల్పించనున్నట్లు తెలిపారు. స్థానిక మినీ స్టేడియంను కూడా క్రీడాకారులు వినియోగించుకోవచ్చన్నారు. ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించి శిక్షణ ఇస్తున్నందుకు వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణతో పాటు సంఘ సభ్యులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

వైద్యులపై దాడులను అరికట్టాలి

- ఐఎంఏ డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా. జేసీ నాయుడు

ఒంగోలు టౌన్: వైద్యశాలల మీద జరుగుతున్న దాడులను అరికట్టి వైద్యులకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీ నాయుడు డిమాండ్ చేశారు. ఐఎంఏ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరుగుతున్న రీజినల్ అకడమిక్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవం సందర్భంగా ఒంగోలులోని సాయి ఐటీఏ కన్వెన్షన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో వైద్యుల మీద దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒత్తిడి, ఆందోళనలతో మెరుగైన వైద్యం చేసే పరిస్థితులు లేకుండా పోయాయని చెప్పారు. వైద్య వృత్తిని కాపాడుకోవాల్సిన అవసరం వైద్యులు, ప్రజలు, ప్రభుత్వాల మీద ఉందని స్పష్టం చేశారు. వైద్యులకు, రోగులకు మధ్య సానుకూల వాతావరణం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యారోగ్యానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునే సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐఎంఏ సలహాలు, సూచనలను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తరహాలో డాక్టర్ ఎమ్మెల్సీను ఇవ్వాలని, ప్రజారోగ్యానికి సంబంధించి చట్టసభల్లో తమ గొంతు వినిపిస్తామని చెప్పారు. ఐఏఎస్ లాగే ఇండియన్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్)ను ప్రవేశ పెట్టాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్లో వైద్యారోగ్యానికి కనీసం 10 నుంచి 15 శాతం కేటాయించాలని ఐఎంఏ మాజీ జాతీయ అధ్యక్షుడు డా.జి సమరం డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రంలో 30 శాతం కేటాయించారని గుర్తు చేశారు. గ్రామస్థాయిలో హెల్త్ సెక్రటేరియట్‌లు ఏర్పాటు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు పెంచాలని కోరారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా ప్రజలకు కనీసం సురక్షిత మంచినీళ్లు ఇవ్వలేకపోవడం బాధాకరం అన్నారు. ఆరోగ్యశ్రీని కేవలం పేదలకే కాకుండా మధ్యతరగతి ప్రజలకు కూడా వర్తింపచేయాలన్నారు. వైద్య రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఒంగోలు ఐఎంఏకు మహిళా వైద్యులు నాయకత్వం వహించడం స్వాగతించదగిన విషయమని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.జయశేఖర్ అన్నారు. కోవిడ్ సమయంలో తక్కువ నష్టంతో బయట పడడానికి కారణం వైద్యుల త్యాగాలేనని చెప్పారు. వైద్య పరికరాల మీద భారీగా జీఎస్టీ విధించడం, వైద్యశాల రిజిస్ట్రేషన్‌పై రకరకాల నిబంధనలను విధించడం సరైన నిర్ణయాలు కావన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఐఎంఏ అధ్యక్షురాలు డా.ఝాన్సీ మాట్లాడుతూ వైద్యుల మీద దాడులను నివారించాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నల్లూరి రాఘవరావు, ఐఎంఏ కార్యదర్శి డా. శ్రావణి, కాన్ఫరెన్స్ కో ఆర్డినేటర్ డా. జాలాది మణిబాబు, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డా. మన్నె వీరయ్య చౌదరి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఏపీటీఎఫ్ ముందంజ



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి

దర్శి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఏపీటీఎఫ్ ముందంజలో ఉంటుందని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి అన్నారు. స్థానిక సైదా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో జిల్లా శాఖ అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి అధ్యక్షతన ఏపీటీఎఫ్ ఉద్యమ అధ్యయన తరగతులు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ 1947లో ఏపీటీఎఫ్ స్థాపించి అప్పట్లోనే టైంస్కేల్ సాధించి ఇప్పటి వరకు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం విద్యా ప్రగతి కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. 1962లో ట్రిపుల్ బెనిఫిట్ స్కీం సాధించామన్నారు. ఐక్య ఉద్యమాల్లో కీలకపాత్ర వహించి ఆర్‌సీ, అప్రెంటీస్ సర్వీస్‌కి నోషనల్ ఇంక్రిమెంట్లు సాధించడంలో ఏపీ టీఎఫ్ కీలక పాత్ర పోషించిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులంతా ఏపీటీఎఫ్ వైపు ఆసక్తిగా చూస్తున్నారని చెప్పారు. రాష్ట్ర పూర్వ కార్యదర్శి, అధ్యక్షుడు పాండురంగ వరప్రసాదరావు, ఎస్.గురునాథశర్మలు మాట్లాడుతూ జీఓ ఎంఎస్ నంబర్ 117ను రద్దు చేయాలని, 13వ పీఆర్సీని ప్రకటించాలని, కేజీ బీవీ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు టైం స్కేల్ ఇవ్వాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓల్డ్ పెన్షన్ వర్తింపజేయాలని కోరారు. ప్రకాశం జిల్లా ఏపీటీఎఫ్ ఉద్యమ చరిత్ర గురించి వివరించారు. రాష్ట్ర కార్యదర్శి బెజవాడ రఘుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఐ.విజయసారథి, జిల్లా సబ్ కమిటీ సభ్యులు నాయబ్ రసూల్, హనుమంతరావు, లేవీ ప్రసాద్, శివరామకృష్ణ, శేషారావు, మల్లికార్జునరావు, తిరుమల, సుబ్బారాయుడు, శేఖర్‌రెడ్డి, ఆనందరావు, సుబ్బారావు, యోహాన్‌రెడ్డి, ఖాదర్ బాషా, శ్రీనివాసరావు, బషీరున్నీషా, రాజ్‌కుమార్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అధికారిక పొగాకు కొనుగోళ్లు పూర్తి



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో 2023–24 సీజన్‌కు 96 రోజుల్లో అధికారిక పొగాకు కొనుగోళ్లు శనివారంతో పూర్తయ్యాయని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి వేలం విక్రయాల్లో 2869 మంది రైతులు పాల్గొన్నారు. వేలం విక్రయానికి 42 కంపెనీలు పాల్గొనగా, అనుమతించిన పొగాకు 10 మిలియన్ల కేజీలు కాగా, 9.91 మిలియన్ల కేజీలు విక్రయించారు. మేలిమి రకం సగటు ధర రూ.313.60, మధ్య రకం సగటు ధర రూ.264.54, తక్కువ రకం సగటు ధర రూ.239.18, వేలం కేంద్రం సగటు ధర రూ.262.17 పలికింది. అలాగే రైతులు దగ్గర మిగిలిన పొగాకును అమ్ముకోవడానికి భారత ప్రభుత్వం అనుమతి జారీ చేసిన తర్వాత అమ్ముతారని తెలిపారు.

16 నుంచి పొగాకు ముక్క, సూర కొనుగోలు

పొగాకు బోర్డు అధికారుల ఆదేశాల మేరకు 16 నుంచి పొగాకు ముక్క, సూర కొనుగోలు వేలం కేంద్రంలోనే నిర్వహిస్తారని శనివారం వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16న చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం, కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం, 18న గొర్లమిట్ట, మల్లవరప్పాడు, మట్టిపాడు, శివపురం, ఆలకూరపాడు, అనంతవరం, జయవరం, పాలేటిపాడు, రావివారిపాలెం, 19న పొందూరు, జమ్ములపాలెం, తుమాడు, 20న కె.ఉప్పలపాడు, కారుమంచి గ్రామాలకు నిర్వహిస్తారన్నారు, ఒక బ్యార్నీకి ఒక బేలు చొప్పున ఇచ్చామన్నారు. పొగాకు బోర్డు ఇచ్చిన బేళ్లను పట్టాలతో బేళ్ల కట్టాలని, తూకం 150 కేజీలు మించరాదు, 25 కేజీలకు తగ్గకూడదన్నారు. మామూలు అమ్మకపు కోటాలో కలువదని, ఇది పూర్తి అదనపు కోటాగా పరిగణిలోకి వస్తుందని చెప్పారు. మీ వద్ద ఉన్న పొగాకు సూరను ఒక బ్యార్నీకి 5 క్వింటాళ్ల చొప్పున అమ్ముకోవచ్చన్నారు. రైతులందరూ పొగాకు బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, పొగాకు బేళ్లలో న్యూస్ పేపర్లు వాడరాదని రైతులకు తెలియజేశారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యం వాహనంతో ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు

నాగులుప్పలపాడు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకుని బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కృష్ణమోహన్ తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో నాగులుప్పలపాడు మండలంలోని పోతవరం గ్రామం వద్ద 63 బస్తాల రేషన్ బియ్యంతో వెళ్తున్న వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. డ్రైవర్ ఆనంద్‌తో పాటు బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో కృష్ణమోహన్‌తో పాటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఊతకోలు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారుల అభివృద్ధికి కృషి



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

ఒంగోలు మెట్రో: జిల్లాలోని కళాకారులందరికీ ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన రావు పేర్కొన్నారు. సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో, శనివారం రాత్రి నిర్వహించిన జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం 7వ వార్షికోత్సవాల ముగింపు సభలో ప్రసంగించారు. ఎన్టీఆర్ కళాక్షేత్రం ఏర్పాటుతో పాటు ఆంధ్ర ప్రదేశ్ నాటక, సంగీత, సాహిత్య అకాడమీ, డైరెక్టర్లుగా ఒంగోలు చెందిన వారిని నియమించిన సంగతి గుర్తు చేశారు. అనంతరం చందు డాన్స్ అకాడమీ చిన్నారులు తమ నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్, భాజపా జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షురాలు తేళ్ల అరుణ ప్రసంగించారు. జిల్లా కేంద్రంలో వందలాదిమంది ప్రేక్షకులు వీక్షించే అధునాతనమైన ఆడిటోరియం నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రంగభూమి అధ్యక్షుడు బేతంశెట్టి హరిబాబు, ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి ధేనువకొండ వెంకట సుబ్బారావు తదితరులు దాతలకు జిల్లా కళాకారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి



కంటి వైద్య శిబిరానికి భారీగా హాజరైన ప్రజలు

- సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహణ
- 3 వేల ఓపీలు రాగా, కంటి ఆపరేషన్లకు 800 మంది ఎంపిక
- 6 వేల మందికి అన్నదానం

చీమకుర్తి: సినీ హీరో, నిర్మాత బూచేపల్లి కమలాకర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం చీమకుర్తిలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చీమకుర్తితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి 3 వేల మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో కంటి ఆపరేషన్లు అవసరమైన 800 మందిని ఎంపిక చేశారు. బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, సోదరి బూచేపల్లి ధనలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. వెంకాయమ్మ కుమారుడు, శివప్రసాదరెడ్డి సోదరుడైన బూచేపల్లి కమలాకర్‌రెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. గత పదేళ్లుగా ఆనవాయితీగా ఏటా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన శంకర కంటి ఆస్పత్రి డాక్టర్ల ఆధ్వర్యంలో బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా కమలాకర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని పేదలకు వైద్యసేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన 800 మంది రోగులను పెదకాకానిలోని శంకర నేత్రాలయ ఆస్పత్రికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా బ్యాచ్‌ల వారీగా తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించిన తర్వాత తిరిగి చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చి వదిలిపెట్టడం జరుగుతుందని బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్‌తో పాటు మందులు, కళ్లజోళ్లను కూడా బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బూచేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి 6 వేల మందికిపైగా స్థానిక ప్రజలు హాజరయ్యారు.

కమలాకర్‌రెడ్డికి ఘనంగా నివాళులు...

సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని చీమకుర్తిలోని కమలాకర్‌రెడ్డి స్మారకం వద్ద పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. బూచేపల్లి కల్యాణ మండపం వద్ద కమలాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలతో పుష్పాంజలి ఘటించారు. ఆయా కార్యక్రమాలలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కమలాకర్‌రెడ్డి సోదరి బూచేపల్లి ధనలక్ష్మి, వారి కుటుంబ సభ్యులు, డాక్టర్ బీ జవహర్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మన్నం శ్రీధర్, కౌన్సిలర్లు సోమా శేషాద్రి, బీమన వెంకట్రావు, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, గోపురపు చంద్ర, మేకల యల్లయ్య, చిన్నపురెడ్డి నాగిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, మంచా హరికృష్ణ, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, సూది శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి, తదితరులు

ఒకే బైకుపై నలుగురు యువకులు

- శ్రీశైలం వెళ్లి తిరిగి ఒంగోలు వస్తూ చీమకుర్తి వద్ద బస్సును ఢీకొట్టిన వైనం
- ముగ్గురికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో గాయపడిన యువకులు

చీమకుర్తి: నలుగురు యువకులు ఒకే బైకుపై ప్రయాణిస్తూ ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఒంగోలు-కర్నూలు రోడ్డుపై చీమకుర్తి-సంతనూతలపాడు మధ్య ఎర్రగుడిపాడు డొంక వద్ద శనివారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఒంగోలు, యర్రగొండపాలెం, మాచర్లకు చెందిన వెంకీ, కౌసిక్, ఆదిత్య, చందలూరి కిట్టు అనే నలుగురు యువకులు ఒంగోలు నుంచి ఒకే బైకుపై శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లారు. శనివారం తిరుగు ప్రయాణంలో ఎర్రగుడిపాడు డొంక వద్ద ఎదురుగా వచ్చిన బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వెంకీ, కౌసిక్, ఆదిత్య కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చందలూరి కిట్టు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వీరిలో కిట్టు 8వ తరగతి చదువుతుండగా, మిగిలిన ముగ్గురు 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న యువకులుగా తెలుస్తోంది. శ్రీశైలం నుంచి ఒంగోలు వచ్చే సమయంలో దోర్నాల సమీపంలో నలుగురు యువకులు పార్టీ చేసుకున్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన ప్రదేశం వద్దకు వచ్చేసరికి వాహనాన్ని నడిపే వ్యక్తికి కళ్లు మూతలుపడటంతో బైకు అదుపుతప్పి బస్సును ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. గాయపడిన వారి పూర్తి వివరాలు, వారి స్వస్థలాలు, ఇతర వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్



కేసుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకోటయ్య



సీజ్ చేసిన టీవీ, ఫ్యాన్‌లు

బేస్తవారిపేట: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు కంభం సీఐ జే రామకోటయ్య తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. బేస్తవారిపేట మండలంలోని పాపాయిపల్లెకు చెందిన కత్తి రోహిత్ అద్దెకు ఆటో తీసుకుని నడుపుకుంటూ జీవిస్తుంటాడు. చెడు వ్యసనాలకు లోనై దొంగతనాలకు అలవాటుపడ్డాడు. ఈ నెల 1వ తేదీ రాత్రి పూసలపాడు బస్టాండ్ సమీపంలోని వెలిగొండ ప్రాజెక్ట్ పునరావాసకాలనీలో ఇనుప గేట్లు, పైపులు దొంగతనం చేశాడు. 2వ తేదీ అదే పునరావాసకాలనీలో స్లాబ్ కోసం ఉంచిన రూ.60 వేల విలువైన ఒక టన్ను 12 ఎంఎం ఇనుప రాడ్లు దొంగిలించాడు. ఈ నెల 6వ తేదీ రాత్రి పాపాయిపల్లెలోని రైతు భరోసా కేంద్రం తాళం పగులకొట్టి లోపలున్న ఎల్‌ఈడీ టీవీ, ఐదు ఫ్యాన్‌లు, గ్యాస్ స్టవ్, సిలిండర్, కుక్కర్, కరెంట్ ఫ్యూజులు దొంగిలించి ఆటోలో వేసుకుని వెళ్లిపోయాడు. ఆ వస్తువులన్నింటినీ అమ్ముకునేందుకు బేస్తవారిపేట సాయిబాబా ఆలయ సమీపంలో ఉన్న పాడుబడిన రేకుల షెడ్డులో దాచి ఉంచాడు. బేస్తవారిపేట ఎస్సై మాధవరావు కేసులు ఛేదించి శనివారం ఉదయం సాయిబాబా గుడి సమీపంలో దొంగతనాలు చేస్తున్న రోహిత్‌ను అరెస్ట్ చేశారు. ఈ వారంలో రైతుల బోర్ల వద్ద విద్యుత్ తీగ దొంగతనం, బేస్తవారిపేటలో ఎల్‌ఈడీ టీవీ దొంగతనం చేసిన కేసుల్లో ఇద్దరిని బేస్తవారిపేట ఎస్సై నరసింహారావు అరెస్ట్ చేశారు. రూ.70 వేల విలువైన కళాశాల ఫెన్సింగ్ ఇనుప తీగ, విద్యుత్ కేబుల్ తీగ, మోటార్ రాగి తీగ, రూ.1.20 లక్షల విలువైన ఎల్‌ఈడీ టీవీని సీజ్ చేశారు. వారం రోజుల్లో 7 దొంగతనం కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2.90 లక్షల విలువైన చోరీ సొత్తును సీజ్ చేసిన బేస్తవారిపేట ఎస్సై, పోలీసులను మార్కాపురం డీఎస్పీ, జిల్లా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై నరసింహారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ ఓనర్ మృతి



లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ ప్రభాకర్

ఒంగోలు టౌన్: రోడ్డు ప్రమాదంలో లారీలో ప్రయాణిస్తున్న లారీ ఓనర్ మరణించారు. వివరాల్లోకి వెళ్తే..శనివారం తెల్లవారుజామున కృష్ణపట్నం పోర్టులో బొగ్గు లోడ్ చేసుకొని వెళ్తున్న లారీ ఒంగోలు శివారులోని కొప్పోలు వద్దకు రాగానే ఎదురుగా వెళుతున్న మరో లారీని ఢీ కొట్టింది. దీంతో లారీలో ప్రయాణిస్తున్న నల్గొండ జిల్లాకు చల్లకుర్తి గ్రామానికి చెందిన లారీ ఓనర్ తుమ్మల పల్లి గోవిందరెడ్డి (45), లారీ డ్రైవర్ ప్రభాకర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. సమాచారం అందిన వెంటనే తాలుకా పోలీసులు రెస్క్యూ టీంను రంగంలోకి దించారు. వారిని బయటకు తీసి జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే గోవిందరెడ్డి మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. డ్రైవర్ మాత్రం చిన్న చిన్న గాయాలతో సురక్షితంగా బయటపడ్డాడు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి జారిపడి వ్యక్తి మృతి



మరణించిన రమేష్‌సింగ్



రమేష్‌సింగ్ (ఫైల్)

ఒంగోలు టౌన్: భవనం పైనుంచి జారిపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన ఒంగోలులోని ట్రంకు రోడ్డులో శనివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్‌లోని బలుత్రాకు చెందిన రమేష్‌సింగ్ (33) ఒంగోలులోని ట్రంకు రోడ్డులో గల ఓ కట్ పీసెస్ సెంటర్లో పనిచేస్తున్నాడు. పది నెలల క్రితమే ఒంగోలు వచ్చిన ఆయన.. పనిచేసే దుకాణానికి దగ్గరలోనే మరో నలుగురితో కలిసి రెండంతస్తుల భవనంలోని ఒక పోర్షన్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం మగ్గం వర్కు పూసలకు బ్రష్ చేస్తున్న రమేష్.. రెండో అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తూ జారి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారు రాజస్థాన్‌లోనే ఉంటున్నారు. స్థానికంగా వ్యాపారాలు చేసుకుంటున్న రాజస్థానీలు నగదు అందజేసి రమేష్‌సింగ్ మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకునిదర్యాప్తుచేస్తున్నారు.

మత్తు మందు ఇచ్చి దాడి చేశారు



మీడియాతో మాట్లాడుతున్న బాలుడి మేనత్త నళిని, పక్కన మత్తుగా నుంచున్న బాలుడు

ఒంగోలు టౌన్: ఇంటర్ సర్టిఫికెట్ల కోసం వచ్చిన విద్యార్థిని తోటి స్నేహితులే మంచి మాటలతో తీసుకెళ్లి కూల్ డ్రింక్‌లో మత్తు మందు ఇచ్చి దాడి చేసి కొట్టారని బాధితుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా ఉలవపాడు గ్రామానికి చెందిన బాలుడు ఒంగోలులోని ఒక ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుకున్నాడు. ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటున్నాడు. సర్టిఫికెట్ల కోసం ఒంగోలుకు రమ్మని అతడి స్నేహితులు ఫోన్లు చేసి ఒత్తిడి చేస్తుండడంతో అతడు మూడు రోజుల క్రితం ఒంగోలు వచ్చాడు. అయితే కాలేజీలో సర్టిఫికెట్లు ఇవ్వడం ఆలస్యమౌతుందని చెప్పిన స్నేహితులు ఏదైనా తిని వద్దాం అంటూ బయటకు తీసుకెళ్లారు. నాలుగు లస్సీలు, ఒక థమ్సప్ తీసుకొని కలుపుకొని తాగారు. స్నేహితుల బలవంతం మీద ఆ బాలుడు కూడా కొద్దిగా థమ్సప్ తాగాడు. కొద్దిసేపటి తరువాత అతడికి మత్తు ఆవరించింది. ఆ తరువాత అతడిని ద్విచక్ర వాహనం మీద సంతపేటలోని కాలేజీ క్యాంపస్‌కు తీసుకెళ్లిన స్నేహితులు తరగతి గదిలో ఉంచి తీవ్రంగా కొట్టారు. స్పృహ కోల్పోయిన అతడిని జీజీహెచ్‌కు తరలించి మీ అబ్బాయి కళ్లు తిరిగి పడిపోయాడు, జీజీహెచ్‌లో చేర్పించినట్లు బాలుడి తండ్రికి సమాచారం ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు వెంటనే ఒంగోలు చేరుకొని కుమారుడిని రిమ్స్ నుంచి ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించి వైద్యం చేయించారు. స్పృహలోకి వచ్చిన బాలుడు జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో శుక్రవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఎస్‌ఐ వెంకటేశ్వర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితుడి మేనత్త దారాన శిని ఆరోపిస్తున్నారు.

జిల్లాలో 448.6 మిల్లీ మీటర్ల వర్షం

- 31 మండలాల్లో వర్షపాతం నమోదు
- సరాసరిన 11.5 మిల్లీమీటర్ల వర్షం

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో గత రెండు రోజుల నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. జిల్లాలోని 31 మండలాల్లో శుక్రవారం 448.6 మిల్లీమీటర్ల వర్షం కురవగా, సరాసరిన 11.5 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అందులో నాగులుప్పలపాడు మండలంలో 34 మిల్లీమీటర్లు, ఒంగోలు మండలం, అర్బన్‌లో 30.6 చొప్పున, మద్దిపాడు 29.4, పుల్లలచెరువు 29, ఎస్ఎన్ పాడు 27.6, చీమకుర్తి 25.4, టంగుటూరు 22, దోర్నాల 21.8, యర్రగొండపాలెం 19.2, ముండ్లమూరు 19, కురిచేడు 16.6, అర్ధవీడు 14.6, పెద్దారవీడు 12.4, త్రిపురాంతకం 11, తాళ్లూరు 10.8, దొనకొండ 10.2, కొత్తపట్నం, దర్శిలో 10 మిల్లీమీటర్ల చొప్పున, మార్కాపురం 7.8, గిద్దలూరు 7.6, కొండపి 6.8, పొదిలి 6.6, జరుగుమల్లి 6.2, ఎస్.కొండ, కొనకనమిట్లలో 6 మిల్లీమీటర్ల చొప్పున, తర్లుపాడు 5.8, మర్రిపూడి 5.2, కనిగిరి, వెలిగండ్లలో 2 మిల్లీమీటర్ల చొప్పున, రాచర్ల, కంభంలో 1.2 మిల్లీమీటర్ల చొప్పున నమోదైంది.